నమస్తే తెలంగాణ
మంచిర్యాల కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎమ్మెల్సీ బరిలో 71 మంది

ముగిసిన ఉపసంహరణ

- రెండు స్థానాలకు 13 మంది విత్‌డ్రా
- పోటీలో పట్టభద్రుల స్థానానికి 56 మంది.. ఉపాధ్యాయ స్థానానికి 15 మంది..

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13 : కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో ప్రధాన అంకం ముగిసింది. ఉపసంహరణకు గురువారం తుదిరోజు కాగా, రోజంతా ఉత్కంఠ కనిపించింది. మొత్తం 13 మంది విత్ డ్రా తర్వాత 71 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్టు తేలింది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా, పట్టభద్రుల స్థానానికి వంద మంది, ఉపాధ్యాయ స్థానానికి 17 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన అనంతరం గ్రాడ్యుయేట్ స్థానం నుంచి 32 తిరస్కరించి 68 మంది నామినేషన్లు, టీచర్ స్థానం నుంచి ఒకటి తిరస్కరించి 16 మంది నామినేషన్లు ఆమోదించారు. గురువారం సాయంత్రం వరకు విత్‌డ్రాకు అవకాశముండగా, పట్టభద్రుల స్థానం నుంచి 12 మంది, ఉపాధ్యాయ స్థానం నుంచి ఒకరు ఉపసంహరించుకున్నారు. ఇక పట్టభద్రుల స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది బరిలో నిలిచారు. వీరంతా నేటి నుంచి ప్రచారం హోరెత్తించనున్నారు. ఇప్పటి నుంచి నేరుగా ఓటర్లను కలుస్తూ, ఓట్లు అభ్యర్థించేందుకు సిద్ధమయ్యారు.

ఉపసంహరించుకున్నది వీరే..

పట్టభద్రుల స్థానం నుంచి మంచిర్యాల జిల్లా దేవునిగూడకు చెందిన గవ్వల లక్ష్మి, కరీంనగర్ పట్టణానికి చెందిన ఎడ్ల సాయికృష్ణప్రియ, సంగారెడ్డి జిల్లాకు చెందిన నాలకంటి యాదగిరి, కోవూరి సత్యనారాయణగౌడ్, జగిత్యాల జిల్లాకు చెందిన ఆలగొండ కృష్ణహరి, నల్లగొండ జిల్లాకు చెందిన రేకల సైదులు, రంగారెడ్డి జిల్లాకు చెందిన లింగాల శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లాకు చెందిన మదనం గంగాధర్, సూర్యపేట జిల్లాకు చెందిన సోమగాని నరేందర్, లింగం కృష్ణ, దార మనోహర్, బడే నర్సయ్య నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఉపాధ్యాయ స్థానానికి మంచిర్యాల జిల్లాకు చెందిన గవ్వల శ్రీకాంత్ విత్ డ్రా అయ్యారు.

విద్యార్థులకు ఆధార్ కార్డు తప్పనిసరి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 13 : ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి యుఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ చైతన్యకుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పొందాలంటే విద్యార్థులకు ఆధార్ కార్డు తప్పనిసరి అన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు సుమారు 36,679 మంది ఉన్నారని, వీరందరికీ ఆధార్ నమోదు చేసేందుకు జిల్లా సంక్షేమ శాఖ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖలు కృషి చేయాలన్నారు. ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో మెగా క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఆధార్ కార్డులు ఇంటింటికీ త్వరగా చేరుకునేలా తపాలాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, ముఖ్య ప్రణాళిక అధికారి కోటయ్య, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, విద్యాశాఖ అధికారులు, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజు, తపాలా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో వారే కీలకం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో స్టేజ్-1, 2 అధికారులే కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్‌తో కలిసి కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్‌లలోని స్టేజ్-1, 2 అధికారులు, సిబ్బందికి వేర్వేరుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను సమన్వయంతో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేజ్-1, 2 అధికారులు, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మరమ్మతులు చేస్తున్న సింగరేణి సిబ్బంది

మాదారంలో తాగు నీటి తిప్పలు

తాండూర్, ఫిబ్రవరి 13 : సింగరేణి ప్రాంతమైన మాదారం టౌన్‌షిప్ కార్మిక కాలనీలో తాగు నీటికి తిప్పలు తప్పడం లేదు. ఎంవీకే-1ఇంక్లైన్ పంపు హౌస్ నుంచి మాదారం ఫిల్టర్ బెడ్‌కు సరఫరా చేసే పంపు మోటర్ చెడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెలకోసారి పంపుసెట్ పాడైపోతుండడంతో మంచినీటి సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుంది. కొద్దిరోజుల క్రితం విద్యుత్ వైరును దొంగలు ఎత్తుకుపోయారు. అక్కడ సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో లక్షలాది రూపాయల విలువైన పంప్ హౌస్, ఫిల్టర్ బెడ్ సామానులకు భద్రత లేకుండా పోతున్నది. వేసవిని దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం కార్మిక కాలనీలకు సక్రమంగా తాగు నీరు సరఫరా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జైపూర్ : ఇందారం-1ఏ గనిపై క్యాంటీన్‌లో కార్మికులతో సీఎండీ బలరాం

నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలి

సింగరేణి సీఎండీ బలరాం

జైపూర్, ఫిబ్రవరి 13 : ఉద్యోగులంతా సంస్థ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి సీఅండ్ఎండీ బలరాంనాయక్ పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని డైరెక్టర్ ఆపరేషన్స్ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది ఎనిమిది గంటలు పని చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ఐకే 1ఏ గని జీవితకాలం మరో 20 ఏళ్లు పెరిగిందని, కార్మికులు రెట్టింపు ఉత్సాహంతో వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగంలో చేరిన వారంతా ఐదేళ్లు భూగర్భ గనిలో పనిచేయాలని తెలిపారు. క్యాంటీన్ కార్మికులతో కలిసి టిఫిన్ చేస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఐకే 1ఏ గనిలో మ్యాన్ రైడింగ్ సిస్టం సమస్యతో లోపలికి, బయటకు రావడానికి ఆలస్యమవుతుందని, పరిష్కరించాలని కార్మికులు విన్నవించుకున్నారు. ఇందుకు ఆయన వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్, ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, మేనేజర్లు రవికుమార్, నాగన్న, రక్షణ అధికారి సతీశ్, యూనియన్ నాయకులు మోత్కూరి కొమురయ్య, చంద్రమోహన్, శ్రీకాంత్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్ధరాత్రి పర్యటించిన సీఎండీ

రెబ్బెన, ఫిబ్రవరి 13 : బెల్లంపల్లి ఏరియాలో గోలేటి సీహెచ్‌పీ, ఖైర్‌గూడ ఓసీపీల్లో బుధవారం అర్ధరాత్రి సింగరేణి సీఅండ్ఎండీ బలరాంనాయక్ పర్యటించారు. ముందుగా గోలేటి సీహెచ్‌పీని పరిశీలించి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఖైర్‌గూడ ఓసీపీలో పర్యటించి రక్షణ చర్యలు, యంత్రాల వినియోగం, ఉత్పత్తిని పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఉత్పత్తి, పెంచాలని, రక్షణకు మొదటి ప్రాధన్యత ఇవ్వాలని, యంత్రాల పనిగంటలు పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కే.వెంకటేశ్వర్లు (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టులు), ఏరియా జీఎం శ్రీనివాస్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో నరేందర్ తదతరులు ఉన్నారు.

మంచిర్యాలలోని రామునిచెరువు

పార్కు నిర్మాణంపై పట్టింపేది?

- నిధులున్నా నిర్లక్ష్యం చేయడంపై స్థానికుల అసహనం
- స్పందించకుంటే ఆందోళనలు చేస్తాం : వాకర్స్ అసోసియేషన్

మధ్యలోనే ఆగిపోయిన రాముని చెరువు పార్కు పనులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 13 : మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువు పార్కు అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. కోట్లాది రూపాయల నిధులున్నా అధికారులు, పాలకుల పట్టింపులేని తనంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారింది. సువిశాలమైన 47 ఎకరాల రాముని చెరువు స్థలంలో పార్కు ఏర్పాటు చేసేందుకు 2022లో టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. పనుల చేజిక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ కొంతమేర పనులు చేపట్టి.. ఆపై బిల్లులు రావడం లేదన్న కారణంతో నిలిపివేశాడు.

కొన్ని పనులు మాత్రమే..

రూ. 3.50 కోట్లతో పార్కులో అభివృద్ధి పనులతో పాటు సుందరీకరణ పనులు చేపట్టాలని అప్పటి కౌన్సిల్ నిర్ణయించింది. రాముని చెరువు కట్ట, 2620 రన్నింగ్ మీటర్ల రెయిలింగ్, 1450 రన్నింగ్ మీటర్ల పాత్‌వేల నిర్మాణం, చెరువు కట్టపై గ్రీనరీ పెంచడం, కట్ట చుట్టూ 30 ఎల్ఈడీ స్తంభాలు, బతుకమ్మ ఆడే ప్రాంతంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేయడం, బతుకమ్మ ఘాట్, వాహనాల పార్కింగ్ ఏరియా, సర్కులర్ బండ్ పోర్షన్‌వంటివి నిర్మించాల్సి ఉంది. కానీ, చెరువుకట్టకు రివిటింగ్, రెయిలింగ్, కట్టపై మట్టి పోయడంలాంటి పనులనే పూర్తిచేశారు. మిగిలిన పనులన్నీ అలాగే వదిలేశారు. అధికారులు, పాలకులు నిర్లక్ష్యంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోగా, స్థానిక ప్రజల్లో అసహనం వ్యక్తమవుతున్నది. ఇకనైనా స్పందించి పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

❖ పార్కు అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి

పార్కు పనులను వెంటనే ప్రారంభించాలి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు వెంటనే ఆదేశాలివ్వాలి. మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడానికి కారకులైన బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. రాముని చెరువు కట్టపై ప్రతి రోజూ 300 మందికి పైగా వాకింగ్ చేస్తుంటారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. వెంటనే పనులు ప్రారంభించక పోతే రాముని చెరువు వాకర్స్, సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం, సీనియర్ సిటిజన్స్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం. - గజెల్లి వెంకటయ్య, రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

2001లో 47 ఎకరాలు అప్పగింత..

2001లో అప్పటి రెవెన్యూ అధికారులు దాదాపుగా 47 ఎకరాల రాముని చెరువు స్థలాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించారు. ఆ సమయంలో చెరువు చుట్టూ కట్ట నిర్మించి, మొక్కలు నాటి, ఫుట్‌పాత్ ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలను అమర్చారు. పిల్లల కోసం ప్రత్యేకంగా పార్కు నిర్మించారు. కొద్దిరోజుల తర్వాత పార్కు ఆలనాపాలనా మరచిపోయారు. ఆపై ఆ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఉదయం వాకింగ్‌కోసం కొందరు రాముని చెరువు కట్టను ఉపయోగిస్తున్నారు. కానీ ప్రజలకు ఉల్లాసం పంచడంలో ఆ పార్కు పనికి రాకుండా పోయింది.

అటవీ అధికారులు వసూలు చేసే రుసం బోర్డు

❖ భారం వేయడం సరికాదు

పారుపల్లి గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై చెక్ పోస్టు ఏర్పాటు చేసి హరిత రుసం వసూలు చేస్తరట. నిత్యం వేలాది మంది ఈ రూట్లో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజలపై పన్ను భారం వేయడం సరికాదు. అడవుల్లో సఫారీలు పెట్టి పర్యాటకుల నుంచి ఆదాయం సమకూర్చుకోవాలే కానీ.. ఇలా రోడ్డు పైన చెక్ పోస్టులు పెట్టి డబ్బులు వసూలు చేయడం బాగా లేదు.
- బాపు, పారుపల్లి (కోటపల్లి)

కోటపల్లి మండలం పారుపల్లి సమీపంలోని జాతీయ రహదారి-63పై అటవీ అధికారులు ఏర్పాటు చేస్తున్న చెక్‌పోస్టు

చెక్‌పోస్టును పరిశీలిస్తున్న అటవీ అధికారులు

- అడవులు, వన్యప్రాణుల పరిరక్షణ పేరిట 'హరిత రుణం' వసూళ్లకు సిద్ధం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనదారులు

చెన్నూర్‌లో అడుగు పెడితే టోల్ కట్టుడే

పారుపల్లి-కిష్టంపేట వద్ద జాతీయ రహదారి-63పై చెక్ పోస్టులు

మంచిర్యాల, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్‌లో అడుగు పెడుతున్నారా.. అయితే మీరు పన్ను కట్టాలిందే.. ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారా.. అవును మీరు విన్నది నిజమే. మంచిర్యాల జిల్లా చెన్నూర్ అటవీ డివిజన్ పరిధిలోని కోటపల్లి మండలం పారుపల్లి వద్ద, చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామం సమీపంలోని జాతీయ రహదారి-63పై అటవీ అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, ఈ మార్గం గుండా ప్రయాణించే వారి వద్ద హరిత రుసుం వసూలు చేయనున్నారు. కాగా, పారుపల్లి నుంచి కిష్టంపేట గ్రామం వరకు ఎలాంటి అడవి లేకపోగా, ఈ ప్రాంతంలో హరిత రుసం పేరిట డబ్బులు వసూలు చేయడమేమిటని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై 'హరిత రుసం' వసూలుకు తెరలేపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెన్నూర్ చుట్టే ఈ చెక్‌పోస్టులుండగా, దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి పోయేవారు అటవీ అధికారులకు పన్ను కట్టాల్సిన పరిస్థితి రానున్నది. అటు మహారాష్ట్ర నుంచి, ఇటు కాళేశ్వరం నుంచి మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతి వాహనానికీ అటవీ అధికారులు 'హరిత రుసం' వసూల్ చేయనున్నారు. మూడు చక్రాల వాహనానికి రూ.30, తేలిక పాటి వాహనాలకు రూ.50, భారీ వాహనాలకు రూ.200 చొప్పున వసూలు చేయనుండగా, ఇదేం తలనొప్పి అంటూ అటవీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

తుది దశకు చేరుకున్న చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు

కోటపల్లి మండలం పారుపల్లి వద్ద, చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై హరిత రుసుం వసూల్ కోసం చేపడుతున్న చెక్‌పోస్టుల ఏర్పాటు తుది దశకు చేరుకున్నది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్, విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలూ సింగ్ మేరు, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, మంచిర్యాల జిల్లా డీఎఫ్‌వో శిశ్‌ఆశిశ్ సింగ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు సిబ్బంది ఉండనుండగా, అక్రమ రవాణాకు తెరపడనున్నది. అయితే ఈ రుణం వసూల్ చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. హరిత రుసుం ద్వారా వచ్చే డబ్బులను అటవీ జంతువుల సంరక్షణ, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలకు వెచ్చిస్తామని అటవీ అధికారులు చెబుతున్నారు. స్థానికుల నుంచి ఎలాంటి రుసుం వసూల్ చేయమని పేర్కొంటున్నారు.

ప్రాక్టికల్స్‌ను పరిశీలించిన మంచిర్యాల డీఐఈవో

ప్రాక్టికల్స్‌ను పరిశీస్తున్న మంచిర్యాల డీఐఈవో అంజయ్య

కోటపల్లి, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్‌ను డీఐఈవో అంజయ్య పరిశీలించారు. గురువారం బాటనీ ప్రాక్టికల్స్ జరగగా, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.